క్లుప్తంగా

నేటి నుంచి మోహిత్‌రెడ్డి పాదయాత్ర

భాకరాపేట: చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడప గడపకు మహా పాదయాత్ర గురువారం నుంచి చిన్నగొట్టిగల్లు మండలంలో ప్రారంభం అవుతుందని ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు దేవరకొండ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పాదయాత్ర ప్రారంభిస్తారన్నారు. మే 8వ తేదీ చిన్నగొట్టిగల్లులో ముగుస్తుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని కోరారు.

పెళ్లి కానుక అందజేత


పెళ్లి కానుకను అందజేస్తున్న నాయకులు

పాకాల: మండలంలోని శంకంపల్లి గ్రామంలో నూతన వధూవరులకు ఎమ్మెల్యే పెళ్లి కానుకను అందజేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పలత, ప్రసన్నకుమార్ జంటకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పెళ్లి బట్టలు, తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేంద్రగుంట డివిజన్ అధ్యక్షుడు గుండ్లూరి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ సరైకోట్టి మునీర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ అందిస్తున్న సర్పంచ్ రూపరామ్మూర్తి, ఎంపీపీ

చంద్రగిరి (తిరుపతి రూరల్): వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చంద్రగిరి పంచాయతీ సర్పంచ్ రూపరామ్మూర్తి ముందుకు వచ్చారు. పంచాయతీ పాలకమండలితో చర్చించి ఏకగ్రీవ ఆమోదంతో చంద్రగిరి టౌన్‌లో చలివేంద్రం ఏర్పాటుకు చొరవ చూపారు. బుధవారం ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. పాదచారులు, వాహనదారులకు మజ్జిగ, తాగునీటిని అందించారు. పార్టీ మండల కన్వీనర్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు గోవర్ధన్ గుప్తా, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టా భూమిలోనే ఇల్లు నిర్మిస్తున్నాం


పట్టాలను చూపుతున్న కేశవులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నాయీ బ్రాహ్మణకాలనీలో తమకు కేటాయించిన పట్టా భూమిలోనే ఇల్లు కడుతున్నట్లు మాజీ ఎంపీటీసీ సభ్యుడు సీఎం కేశవులు పేర్కొన్నారు. బుధవారం చంద్రగిరిలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పదేళ్ల క్రితం తమకు కేటాయించిన ఐదు సెంట్ల పట్టా స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటున్నామని, అయితే ఓర్వలేని కొందరు రూ.25 కోట్ల స్థలం కబ్జా చేసి ఇల్లు నిర్మిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం దారుణమన్నారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకుందాం

- కార్పొరేషన్ కమిషనర్ హరిత
- జూన్ కల్లా శ్రీనివాస సేతు అందుబాటులోకి తేవాల్సిందే


పారిశుద్ధ్య సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతిని స్వచ్ఛ నగరంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత కోరారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పరిశుభ్రత, చెత్త సేకరణపై ప్రజలతో మాట్లాడారు. ప్రతిరోజు చెత్త సేకరణ జరుగుతుందా? సిబ్బంది వస్తున్నారా ?, ప్రతి రోజు కాలువల్లో చెత్తాచెదారం తొలగిస్తున్నారా? తాగునీటి సరఫరా ఎలా జరుగుతోంది అన్న అంశాలపై ఆరా తీశారు. 17వ డివిజన్‌లో పర్యటించే క్రమంలో మ్యాన్‌హోల్ పైకప్పు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా ఉండడాన్ని గుర్తించిన కమిషనర్ ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరమ్మతులు చేసి మ్యాన్‌హోల్ పైకప్పు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, సిబ్బంది చొరవ చూపాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతి ఇంటా తడి, పొడి చెత్తను వేరువేరుగా స్వీకరించాల్సిందేనన్నారు. కాలువల్లో వ్యర్థాలు లేకుండా నిర్దేశించిన గడువులో తొలగించాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రజలను భాగస్వాములు చేసి క్లీన్ తిరుపతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. యూడీఎస్ మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లోపై ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్, ఏసీపీ షణ్ముగం, కార్పొరేటర్ తాళ్లూరి రత్నకుమారి, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఉన్నారు.

శ్రీనివాస సేతు పనులను వేగవంతం చేయాలి

శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్‌ని జూన్ చివరికల్లా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ బి.హరిత సూచించారు. తన చాంబర్‌లో ఇంజినీర్లు, ఆఫ్కాన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రైల్వే బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలన్నారు. పలు ప్రాంతాల్లో డ్రైవ్ పనులు పెండింగ్‌లో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుకున్న సమయానికి పూర్తి చేసి తీరాల్సిందేనని ఆదేశించారు. ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, ఆఫ్కాన్ ప్రతినిధి స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక విమర్శలు


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

- తిరుపతి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా
- మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు వైఎస్సార్‌సీపీ నేతల సవాల్

తిరుపతి కల్చరల్: మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కుటుంబం పదేళ్ల పాలనలో తిరుపతిలో దోచుకోవడం తప్ప అభివృద్ధి చేసింది లేదని, గత నాలుగేళ్లలో తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే భూమనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తనను నమ్మిన ప్రజల సంక్షేమం కోసం, ఆధ్యాత్మిక నగర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అని స్పష్టం చేశారు. తిరుపతిలో నిత్యం ట్రాఫిక్ కష్టాలతో ఇటు స్థానికులు, అటు యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చేపాలనే ఉద్దేశంతో మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. అయితే అభివృద్ధి అంటే తెలియని టీడీపీ నేతలు ఎప్పుడో ఎన్టీఆర్ చేసిన పనులను చంద్రబాబే చేసినట్లు భ్రమపడుతూ మభ్యపెట్టే ప్రయత్నం చేయడం సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. అభివృద్ధి పనులపై చర్చకు టీడీపీ నేతలు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. వైఎస్సార్‌సీపీ నేతలు దొరైరాజు, నల్లాని బాబు, మద్దాలి శేఖర్ రాయల్, పసుపులేటి సురేష్, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మోహన్ పాల్గొన్నారు.

చంద్రగిరి డీఎస్పీగా యశ్వంత్

- తిరుపతి ట్రాఫిక్‌కు నరసప్ప బదిలీ


టీడీ యశ్వంత్

తిరుపతి రూరల్: చంద్రగిరి డీఎస్పీగా టీడీ యశ్వంత్ నియమితులయ్యారు. ఆ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. యశ్వంత్ ప్రస్తుతం పుట్టపర్తి డీఎస్పీగా పని చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాగా ఉన్నప్పుడు చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలు తిరుపతి వెస్ట్, రేణిగుంట, చిత్తూరు, మదనపల్లె ఇలా నలుగురు డీఎస్పీల పాలనలో ఉండేవి. తిరుపతి జిల్లాగా ఏర్పడిన తర్వాత అన్ని మండలాలు తిరుపతి వెస్ట్ డీఎస్పీ కిందకు వచ్చాయి. వెస్ట్ డీఎస్పీ పరిధి ఎక్కువగా ఉండడంతో పరిపాలన సౌలభ్యం కోసం చంద్రగిరిని ప్రత్యేక సబ్‌డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ప్రథమ డీఎస్పీగా టీడీ యశ్వంత్‌ను నియమించారు. కాగా తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో అవినీతికి పాల్పడిన ఓ సీఐ, ముగ్గురు ఎస్ఐలను సస్పెండ్ చేసిన ఘటనలో విచారణాధికారిగా యశ్వంత్ ఉండడం గమనార్హం. అప్పుడు ఆయన పుత్తూరు డీఎస్పీగా ఉన్నారు. చారిత్రాత్మక ప్రదేశం చంద్రగిరికి డీఎస్పీగా రావడం అదృష్టమని, త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు సాక్షితో డీఎస్పీ యశ్వంత్ తెలిపారు.

తిరుపతి ట్రాఫిక్‌కు నరసప్ప

తిరుపతి వెస్ట్ డీఎస్పీగా ఉన్న నరసప్ప తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. మూడేళ్లకుపైగా ఆయన సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. క్రైం రేటును తగ్గించడంలో, అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలోనూ ముక్కుసూటిగా వ్యవహరించారనే పేరు సంపాదించారు.

సీఎం జగన్‌కు ఆహ్వానం


సీఎంకు వివాహ పత్రిక అందజేస్తున్న చక్రవర్తిరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల అధినేత డీవీఎస్ చక్రవర్తి రెడ్డి బుధవారం విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె సాయి స్నోహిత వివాహానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన తమ్ముడు రామ్‌సునీల్ రెడ్డి ఉన్నారు.

ఘనంగా వేదం మొబైల్స్ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: స్థానిక తిలక్ రోడ్డులోని సెంట్రల్ పార్క్‌లో గోల్డెన్ ప్లాజా, వేదం మొబైల్స్ 23వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. గోల్డెన్ ప్లాజా 23వ వసంతంలోకి అడుగుపెట్టడం అభినందనీయమన్నారు. మరింత ప్రజాదరణతో అభివృద్ధి పథంలో సాగాలని ఆకాంక్షించారు. వేదం మొబైల్ అధినేత ఆముదాల ప్రభాకర్ మాట్లాడుతూ.. 23 వార్షికోత్సవం సందర్భంగా మొబైల్స్, టీవీ లాప్‌టాప్స్, స్మార్ట్ వాచెస్ అండ్ సర్వీస్, కొనుగోలుపై చేసే వినియోగదారులకు సులభవాయిదాల పద్ధతిలో అందిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ కన్నా తక్కువ ధరతో ఈ నెల 30వ తేదీ వరకు ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపారు.

సద్గురు త్యాగరాజస్వామి జయంతోత్సవం


సంగీత గానం చేస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: టీటీడీ, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల సంయుక్తంగా సంగీత కళాశాల ఆవరణలో బుధవారం సద్గురు శ్రీత్యాగరాజస్వామి వారి 256వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా శ్రీత్యాగరాజస్వామి వారి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం సంకీర్తన గోష్ఠిగానంతో త్యాగరాజస్వామికి సంగీత నీరాజనాలు అందించారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో తిరుమలలోని నాద నీరాజనం వేదికపై త్యాగరాజ పంచరత్న గోష్ఠిగానంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ సంగీత విద్వాంసులు, కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై కమిటీకి సంబంధం లేదు


మాట్లాడుతున్న తిమ్మప్ప ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ సభ్యులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): తిమ్మప్ప దేవాలయ పునర్‌నిర్మాణంపై సంబంధం లేని వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆలయ పునరుద్ధరణ కమిటీ అధ్యక్షుడు మునిగంగి రెడ్డి అన్నారు. చంద్రగిరిలో బుధవారం ఆయన మాట్లాడారు. ఆలయ పునర్‌నిర్మాణం కోసం 2018లో ఆలయ స్థల యాజమాని జ్యోతి తమ కమిటీకి 20 సెంట్ల భూమి దానం ఇచ్చారని తెలిపారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ స్థలాన్ని పరిశీలించి రూ.50 లక్షలు మంజూరు చేసేందుకు అంగీకరించారని తెలిపారు. అయితే తొండవాడకి చెందిన మురళిరెడ్డి సొసైటీ ఏర్పాటు చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. దీని వల్లనే టీటీడీ అధికారులు నిధులు మంజూరు చేసేందుకు ముందుకు రావడం లేదని చెప్పారు. చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అతనిపై కేసు నమోదు చేశారని తెలిపారు. ప్రజలు ఎవరూ విరాళాలు ఇవ్వరాదని కోరారు. కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం యాదవ్, చంద్రబాబు, నరేష్, తిలక్ యాదవ్ పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై స్వామివారి దర్శనం


తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామివారు

తిరుపతి రూరల్: పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని బుధవారం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల వారు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు అధిక ప్రాధాన్యం

పాకాల: గ్రామాల్లో రెవెన్యూ సమస్యలకు అధిక ప్రాధ్యాన్యత ఇవ్వాలని తిరుపతి జేసీ డీకే బాలాజీ అన్నారు. బుధవారం పాకాల మండలంలోని దామలచెరువు పంచాయతీ బందార్లపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. తప్పులను సరి రైతులకు న్యాయం చేయాలని చెప్పారు. నోషనల్ ఖాతాలో ఉన్న రికార్డులను సేకరించి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మండల సర్వేయర్ గోపి, వీఆర్వోలు హరికృష్ణ, లోకేష్, సుబ్రమణ్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీరోడ్లు

- మేయర్ శిరీష


పనులను పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

తిరుపతి తుడా: మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు మేయర్ శిరీష తెలిపారు. తాతానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ రోడ్లు తుది దశకు చేరుకుంటున్నాయని తెలిపారు. ఈ రోడ్లు పూర్తవ్వగానే గత కౌన్సిల్‌లో తీర్మాణం చేసిన రూ.42 కోట్ల అభివృద్ధికి సంబంధించి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. సీసీరోడ్లు, యూడీఎస్, మురుగుకాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. 50 డివిజన్లకు కౌన్సిల్ నిధులను కేటాయించామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌వంశీ, పెద్దారెడ్డి శేఖర్‌రెడ్డి, పెద్దారెడ్డి మురళీరెడ్డి ఉన్నారు.

ఏటీఎన్స్ విజయకేతనం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఏటీఎన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జూనియర్ సీఈసీ ఫలితాల్లో పి.హరణిశ్రీ 481, యు.లిఖిత 471, కె.కేతనసాయి 457మార్కులు, ఎంపీసీలో జి.వాహిని 455, ద్వితీయ సంవత్సర ఎంపీసీలో ఎం.హేమలత 973 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మోహన్‌కృష్ణ, డైరెక్టర్లు నరేంద్రకుమార్, తిరుమలేశ్వర్ నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్లు అభినందించారు.

సత్తాచాటిన శ్రీగాయత్రి విద్యార్థులు


ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీగాయత్రి ఐఐటీ, మెడికల్ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ నీరజాక్షులు, డైరెక్టర్ కవిత తెలిపారు. తమ విద్యార్థులు 98 శాతం మందికిపైగా ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

కండలేరులో 38.553 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 38.553 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,680 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు 30, హైలెవల్ స్లూయిస్‌కు 60 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో అశ్వమేథ ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి అశ్వమేథ మెడికల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీ విభాగంలో సాయిప్రీతి 432, కె.నియతి 429, రాజశ్రీ 427, రోహిత్ 426 మార్కులు సాధించారు. వీరితో పాటు 400మార్కులకుపైగా 20మంది సాధించారు. ఎంపీసీ విభాగంలో సాయిస్నేహ 464, అనూష 463, టీఎస్.చాతుర్య 459, ఎ.దివ్యారెడ్డి 457, శ్రేష్మరాయల్ 455తో పాటు 400కుపైగా మార్కులను 30మంది విద్యార్థులు సాధించారు. ద్వితీయ సంవత్సర బైపీసీలో వర్షారెడ్డి, నీహారికలు 988, ఎస్వీ హారిక 987, ఉమేష్ చౌదరి 983, తేజశ్రీ 982 సాధించారు. ఎంపీసీలో అంజలిరత్న 984, విధీష 983, నాగ ప్రహర్ష 977, బి.హన్న 974 మార్కులతో సత్తాచాటారు. వీరిని కళాశాల డైరెక్టర్లు ఇషత్, గోవర్ధన్, ప్రిన్సిపల్స్ భాస్కర్‌రెడ్డి అభినందించారు.

శ్రీచైతన్య విజయఢంకా


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం, డీన్‌లు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం.భవిత, ఎస్వీ భువనప్రియ, ఓ.మధునిత్, ఎస్.సాహిత్య, ఎం.మహిత 470 మార్కులకు 465 సాధించారు. వీరితో పాటు 460 మార్కులకుపైగా 186మంది, 450కిపైగా 451 మంది, 400కుపైగా 2012 మంది మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో సయ్యద్ సోహ 440 మార్కులకు 435, నజీం 434, అలాగే 430కిపైగా 51మంది, 400కుపైగా 471మంది మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో వై.యామిని, ఎం.శరణ్య 989, కె.వింధ్యారాణి, ఇందిర ప్రియదర్శిని పి.దినిత, భవ్యశ్రీ 988 మార్కులు సాధించారు. బైపీసీలో బి.మోన 987, కె.హర్ష 986, 950కిపైగా 624మంది, 900కుపైగా 1,910మంది విద్యార్థులు మార్కులు సాధించారు. ఏజీఎం బీవీ ప్రసాద్, డీన్‌లు కేఎల్‌జీ ప్రసాద్, రామ్మోహన్‌రావు, కుమార్, భాస్కర్, కృష్ణకుమార్ విద్యార్థులను అభినందించారు.